ఆయుర్వేదన

- పరాయి పంచన ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి
- కూలేందుకు సిద్ధంగా భవనం
- శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో భవనంలో నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న రోగులు, ఆస్పత్రి సిబ్బంది


శిథిలావస్థకు చేరిన ఎంపీడీవో భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి


కూలేందుకు సిద్ధంగా ఉన్న దేవరాపల్లి ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం

శిథిలావస్థకు చేరిన భవనంలో ఈ ఆస్పత్రి నడుస్తోంది. అయినా ఎవరికీ పట్టదు. దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆయుర్వేద,హోమియో వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేదానికి ప్రాముఖ్యత ఇస్తోంది. కానీ దేవరాపల్లిలోని ఆయుర్వేద ఆస్పత్రి పరిస్థితిని చూస్తే అందుకు పూర్తి భిన్నంగా ఉంది.

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి పరాయి పంచన కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలోని గల ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో సమీపంలోని శిథిలావస్థలో ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయ భవనంలో ఆయుర్వేద ఆస్పత్రిని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ భవనం సైతం వర్షం వస్తే కారిపోతుండడంతో పాటు భవనం శ్లాబ్ పెచ్చులు రాలిపడుతున్నాయి. గత్యంతరం లేని స్థితిలో ఆయుర్వేద వైద్యాధికారి గ్రీష్మ, సిబ్బంది అక్కడే వైద్య సేవలందిస్తున్నారు. రోజూ ఆయుర్వేద వైద్య సేవల కోసం 15 నుంచి 20 మంది వరకు రోగులు వస్తుంటారు. ఆస్పత్రి ఫర్నిచర్ సైతం లేకపోవడంతో వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇంగ్లిష్ మందుల వినియోగంతో దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్) వచ్చే ప్రమాదం ఉన్నందున గ్రామీణ ప్రాంత ప్రజలు ఆయుర్వేద వైద్యంపై మొగ్గ చూపుతున్నారు. ఇక్కడి ఆస్పత్రిలో అన్ని రకాల మందులు, వైద్యసేవలు అందుబాటులో ఉన్నప్పటికీ, శిథిలావస్థకు చేరిన భవనంలో ఆస్పత్రిని నిర్వహిస్తుండటంతో రోగులు ఇక్కడికి వచ్చేందుకు భయాందోళనలు చెందుతున్నారు. ఆస్పత్రి భవనం నిర్మించి ఫర్నిచర్ ఏర్పాటు చేస్తే వైద్యసేవల కోసం ఇక్కడికి వచ్చే వారి రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా ప్రభుత్వం, స్థానిక పాలకులు దృష్టి సారించడం లేదు. ఆస్పత్రిలో కాంపౌండర్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికార్లు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయుర్వేద ఆస్పత్రికి సొంత గూడును సమకూర్చాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. స్థానిక ఆయుర్వేద ఆస్పత్రిలో టీబీ, సుగర్, జీర్ణకోశ, లివర్ వ్యాధులు, పక్షవాతం, నరాల వ్యాధులు, కీళ్ల వ్యాధులు, మెడ, నడుము నొప్పి, చర్మ వ్యాధులు, మానసిక, మలబద్ధకం తదితర వ్యాధులకు వైద్య సేవలందిస్తున్నారు.


వైద్య సేవలందిస్తున్న ఆయుర్వేద వైద్యురాలు గ్రీష్మ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆయుర్వేద ఆస్పత్రి భవనం పూర్తిగా శిథిలమవడంతో పాత ఎంపీడీవో కార్యాలయ భవనంలో వైద్య సేవలందిస్తున్నాం. ఇక్కడ ఆస్పత్రి భవన పరిస్థితిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇటీవల జరిగిన సమావేశంలో ఉన్నతాధికారులు ఆస్పత్రుల గురించి ఆరా తీశారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. అన్ని వ్యాధులకు వైద్య సేవలందిస్తున్నాం.

– జి. గ్రీష్మ, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి.

బెల్టు షాపులు తొలగించాలంటూ గీత కార్మికుల ఆందోళన


ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కల్లుగీత కార్మికులు

నర్సీపట్నం: బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఏపీ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి దేముడు మాట్లాడుతూ గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఊరువాడా ఎక్కడపడితే అక్కడ బెల్టు షాపుల్లో మద్యాన్ని విచ్చలవిడిగా అమ్మిస్తూ, గీత కార్మికుల పొట్టకొడుతున్నారని వాపోయారు. కల్లు అమ్మకాలు లేక గీత కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయన్నారు. వీధి వీధికి బెల్టుషాపులను పెట్టి కల్లుగీత వృత్తిని దారుణంగా దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో అనధికారికంగా మూడు వేలకు పైగా బెల్టు షాపులు ఉన్నాయన్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారుల అండదండలతో బెల్టు షాపుల నిర్వహణ జరుగుతోందన్నారు. బెల్టు షాపులు నడిపినా, షాపుల వెనుక రూమ్‌లు పెట్టి మద్యం అమ్మినా మద్యం షాపులు లైసెన్స్ రద్దు చేస్తామని సీఎం చంద్రబాబునాయుడు చేసిన ప్రకటనలు ఆచరణలో అమలు కావడం లేదని. బెల్టుషాపులను నిరోధించాలని ఆయన డిమాండ్ చేశారు. దొడ్డి రామునాయుడు, బత్తిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'


కొరుప్రోలు ఫాణి శాంతారామ్

గొలుగొండ: మండలంలో ఎర్రవరం రాజులబాబు గుడి వద్ద శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొరుప్రోలు ఫాణిశాంతారామ్ తెలిపారు. చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రజలకు తెలిపే విధంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పాల్గొనున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి ఎంపీపీ,జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అనుబంధ కమిటీ ల సభ్యులు హాజరు కావాలని కోరారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రాజారామ్

మాడుగుల : కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలని ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. జేడీపేట సచివాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కిశోర బాలికల వికాసం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు . అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, కార్యదర్శి జె. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యవరంలో ...


మండలంలో సత్యవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కిశోర బాలిక వికాసం కార్యక్రమంలో పౌష్టికాహారం తయారీపై వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు తలెత్తుతాయని కేజే పురం సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు. కె.జె.పురం 1 వ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన బాల్య వివాహాల నివారణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థులకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించారు.

సీసీ రోడ్డు పనులకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ సూరినాయుడు


దేవరాపల్లి: మండలంలోని మామిడిపల్లిలో జిల్లా పరిషత్ నిధులు సుమారు రూ. 10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ కర్రి సూరినాయుడు శుక్రవారం భూమి పూజ చేశారు. మామిడిపల్లి, వేచలం ఆర్అండ్ బీ రోడ్డు నుంచి దొగ్గవారి కల్లాల మీదుగా శ్మశానం వరకు ఈ రోడ్డు నిర్మించనున్నారు.

చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాధవి



చోడవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అల్లం మాధవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గోవాడ గ్రామానికి చెందిన మాధవి ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు చోడవరం మార్కెట్ కమిటీ ద్వారా అన్ని విధాలుగా మేలు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సుద్దలపాలెంలో వైద్య శిబిరం


సుద్దలపాలెంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గొలుగొండ: సుద్దలపాలెంలో శుక్రవారం గొలుగొండ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో జ్వరాలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళదాం

మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు


క్యూర్‌కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తదితరులు

మాడుగుల: బూటకపు హామీలతో ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు, మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు అన్నారు. ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, పార్టీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజల అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మాడుగుల మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీపై వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మండల స్థాయి వరకు సమావేశాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి శతశాతం హామీలను ఏడాదిలోనే అమలు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరం పింఛను తప్ప అన్ని హామీలను ఎగ్గొంటిందన్నారు. క్యూర్‌కోడ్ వాల్‌పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలసి ఆవిష్కరించారు. తల్లికి వందనం ప్రతి పిల్లవాడికి అందజేస్తానని, చెప్పి విద్యుత్ బిల్లులు ఎక్కువ వచ్చాయని, కార్లు ఉన్నాయన్న కుంటిసాకులు చూపించి ఎందరో పిల్లలకు తల్లికివందనం నిధులు ఎగ్గొట్టారని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి రూ. 20 వేలు, 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు గల మహిళలకు నెలకు రూ.1500 , నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు, లేకుంటే నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే బీసీ,మైనార్టీల వారికి పింఛను అందజేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు, వాటిని ఎక్కడ అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రమంతా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణమని చెప్పారని, నేడు నియోజకవర్గం వరకు ఇస్తారో, జిల్లాకు వరకు ఇస్తారో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో పేదవాడిని ఆదుకునేందుకు ఆరోగ్యశ్రీని రూ.25 లక్షల వరకు అమలు చేస్తే కూటమి ప్రభుత్వం దాన్ని గాలికి వదేలిసిందని చెప్పారు. కూటమి గద్దెనెక్కి 14 నెలలు గడుస్తున్నా చంద్రబాబు హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గ్రామ స్థాయిలో నిర్వహించే బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు మోసాలను వివరించాలని సూచించారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయించే బాధ్యత తనదేనని చెప్పిన పవన్ కల్యాణ్ కూడా అధికారంలోకి వచ్చాక ఆ పథకాలు ఊసే లేదని విమర్శించారు.

రూ.కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి

గత ప్రభుత్వ హయాంలో తాను డిప్యూటీ సీఎంగా మాడుగుల నియోజవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టానని ముత్యాలనాయుడు తెలిపారు. గ్రామాగ్రామానికి తారు, సీసీ రోడ్లు నిర్మించామని చెప్పారు. తాను మంజూరు చేసిన పనులు కూటమి నాయకులు ఇప్పుడు వారి ఖాతాలో వేసుకుంటున్నారని చెప్పారు. రెండున్నర రూ.కోట్లతో మాడుగులలో పీఆర్ గెస్ట్ హౌస్‌ను సర్వాంగ సుందరంగా నిర్మించామని, ప్రతి గ్రామంలో సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, మాడుగులలో రూ 5.60 కోట్లతో ఆస్పత్రి నిర్మాణం,కె. కోటపాడులో కోట్లాది రూపాయలతో ఆస్పత్రుల ఆధునీకీకరణపనులు చేసినట్టు తెలిపారు. పెద్దేరు జలాశయానికి గత ప్రభుత్వంలో సుమారు రూ.90 కోట్లు మంజూరు చేస్తే అప్పటిలో కొంత పనులు జరిగాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ పనులు నిలుపుదల చేసిందని, మళ్లీ ఇప్పుడు నిధులు మంజూరు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.


సభకు హాజరైన నాయకులు కార్యకర్తలు

ఇప్పటికైనా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి ప్రజా సంక్షేమంవైపు దృష్టి సారించాలని హితవు పలికారు. ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు పాలమేర విజయలక్ష్మి, కొత్తపల్లి శ్రీనివాస్, మండల యూత్ నాయకుడు తంటపు రెడ్డి బన్ని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాస్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శోలంరమేష్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ పటిష్టంగా ఉందని, రానున్న కాలంలో మాడుగుల కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీలు కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీషా, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పడాల అప్పల నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు శేనాపతి గంగాధర్, అల్లంగి సంజీవరావు,కాళ్ళరాము, శ్రీనాదు జగ్గారావు, గోకేడ అప్పలనాయుడు, తాళ్ళపురెడ్డి రాంబాబు, పల్రే రాము నాయుడు, శనివాడ వెంకటరమణ, సేమాల గురువు నాయుడు, కాత రమణ, కోట్యాడ భాస్కరరావు, కాళ్ళ అప్పల నాయుడు, కర్రి గణేష్, వేమన గణేష్, యన్నంశెట్టి వెంకట రమణ,కుక్కర శ్రీధర్, కాళ్ళరాజు, యలమంచిలి రమణ,మిత్తిపాటి అశోక్, దాసరిరాజు, పుట్టా మురళి, పడాల చిట్టిబాబుతో పాటు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్

నాతవరం: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చంద్రబాబునాయుడు పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు అధ్యక్షతన నాతవరంలో శుక్రవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాతవరం మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలిచ్చి చందబాబునాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అధికంగా అప్పులు చేశారని కూటమి నాయకులు అబద్ధాలు చెప్పి ప్రజలు నమ్మించారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వమే అధికంగా అప్పులు చేసిందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి ఇటీవల తెలిపారని చెప్పారు. మాయ మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి నాయకుల మోసాలను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు తెలియజేయాలన్నారు. రైతు భరోసా, ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం, నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థికసాయం, ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలవారికి 50ఏళ్లకు పింఛన్ తదితర పథకాలేమీ ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కూటమి నేతలు ఇచ్చిన బాండ్ల లబ్ధిదారులతో మాట్లాడి చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారన్న విషయంపై ఈనెల 21 నుంచి వైఎస్సార్ సీపీ క్షేత్రస్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. కూటమి నేతలు.. వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు చేయడంతో పాటు, అక్రమ కేసులు పెడుతున్నారని వాటికి ఎవరూ భయపడవద్దని, వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని చెప్పారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. అనంతరం మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ముఖ్య నాయకులతో సమావేశమై ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, జెడ్పీటీసీ సభ్యులు కాపారపు అప్పలనర్స, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, కాపు, పామాయిల్ కార్పొరేషన్ల రాష్ట్ర మాజీ డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పైల పోతురాజు, నాతవరం సర్పంచ్ గోలగాని రాణి, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, సర్పంచుల సంఘం మండల శాఖ అధ్యక్షుడు మిరపల వెంకటరమణ, పార్టీ మహిళా విభాగం మండల శాఖ అధ్యక్ష ,ఉపాధ్యక్షులు ఇనపసప్పల పుష్ప, పాలుపర్తి రాధ పార్టీ జిల్లా నాయకులు మంకు సాంబమూర్తి, ఆడిగర్ల నాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.


సభకు హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పరిశ్రమల ఏర్పాటుకు భూములిచ్చేది లేదు

గ్రామ సభల్లో తేల్చి చెప్పిన రైతులు


ఆర్.భీమవరంలో రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ లక్ష్మి

బుచ్చెయ్యపేట: పరిశ్రమలకు వ్యవసాయ భూములు ఇవ్వబోమని మూడు పంచాయతీల రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. పరిశ్రమల ఏర్పాటు కోసం భూ సేకరణకు శుక్రవారం ఆర్.భీమవరం,మల్లాం, ఆర్.శివరాంపురం గ్రామాల్లో తహసీల్దార్ లక్ష్మి గ్రామ సభలు నిర్వహించారు. భూములు లాక్కొని అన్యాయం చేయవద్దని మూడు గ్రామాల సర్పంచ్‌లు నమ్మి నీరజ అప్పలరాజు,బర్ల శివ,ఐల్లిన అమ్మునాయుడు రైతు సంఘ నాయకులు బోయిన నారాయణమూర్తి,సేనాపతి నాయుడు,పల్లెల ఈశ్వరరావు,బాబూరావు,దేవర రాజు,అప్పారావు, తాతాజీ,చందక శ్రీను తదితర్లు ఈ సభల్లో తహసీల్దార్‌ను కోరారు. తాతల కాలం నుంచి భూములను దున్నుకుంటున్నా నేటికి సరైన భూ రికార్డులు మాకు లేవని మాకు న్యాయం చేయాలనుకుంటే ముందుగా మేం సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని కోరారు. బలవంతంగా భూ సేకరణ చేస్తే అడ్డుకుంటామన్నారు. రైతుల అభిప్రాయాలను జిల్లా అధికార్లు దృష్టి తీసుకెళతామని తహసీల్దార్ తెలిపారు.

అర్ల పాఠశాల హెచ్‌ఎంను మార్చాలి

రోలుగుంట: అర్ల గిరిజన పాఠశాల హెచ్‌ఎం నుంచి ఇక్కడి నుంచి బదిలీ చేసి, వేరొకని నియమించాలని డిమాండ్ చేస్తూ పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల వద్ద ధర్నా చేశారు. ఈ నెల 10 న పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో తెలుగుదేశం పార్టీకి చెందిన పాడి శ్రీను, హెచ్‌ఎం రాముల మధ్య వాగ్వాదం జరిగింది.దీంతో పరస్పరం ఎంఈవోకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గ్రామస్తులు ధర్నా చేశారు. తల్లిదండ్రులపై అసత్య వ్యాఖ్యలు చేసిన రాము మాస్టార్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విద్యా కమిటీచైర్మన్ పాడి లక్ష్మి మాట్లాడుతూ హెచ్‌ఎంపై పలు ఆరోపణలు చేశారు. ఈ ధర్నాలో కమిటీ వైస్ చైర్మన్ పాడి శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నతాధికారుల ఆదేశం మేరకు చర్యలు

ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని, వారి ఆదేశాలమేరకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో జాను ప్రసాద్ తెలిపారు. రాము మాస్టారును వేరొక పాఠశాలకు మారుస్తామని చెప్పారు.

శాకంబరిగా దుర్గాదేవి


కొత్తకోటలో శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గా దేవి


ఎం. కోడూరులో శాకంబరి అలంకరణలో దుర్గాదేవి

మాడుగుల రూరల్/ఎస్.రాయవరం: ఎం.కోడూరు, కొత్తకోటలలో దుర్గాదేవి శుక్రవారం శాంకబరిగా దర్శనమిచ్చారు. మాడుగుల మండలం ఎం.కోడూరులో దుర్గాలమ్మను ప్రతి ఏటా ఆషాఢమాసంలో ఓ శుక్రవారం శాకంబరీగా అలంకరించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సారెను ఊరేగించారు. రావికమతం మండలం కొత్తకోటలో దుర్గాదేవి అమ్మవారిని పలు కూరగాయలతో శాకంబరి దేవిగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

కె.కోటపాడు : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గోరుగుంతు రమేష్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో గ్రామ ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



శాకంబరిగా దర్శనమిచ్చిన కనక్యాపరమేశ్వరి అమ్మవారు

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం


ఎం. అలమండలో ఇన్‌లైన్ క్లోరినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న సర్పంచ్ దాడి జగన్

దేవరాపల్లి: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా మంచినీటి ట్యాంక్‌లకు ఇన్ లైన్ క్లోరినేషన్ వ్యవస్థ ఏర్పాటు చేసినట్టు ఎం. అలమండ సర్పంచ్ దాడి జగన్ తెలిపారు. మండలంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఇన్‌లైన్ క్లోరినేషన్ ప్రక్రియను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పంప్ ఆపరేటర్లు మంచినీటి ట్యాంక్‌ల్లో దిగి క్లోరినేషన్ చేసే పని లేకుండా బోరు నుంచి ట్యాంక్‌కు మంచినీరు పంపింగ్ అయ్యే సమయంలోనే ఈ వ్యవస్థ ద్వారా క్లోరినేషన్ ప్రక్రియ జరిగిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం


గుల్లేపల్లిలో కురుస్తున్న వర్షం

కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం నారుమడులకు మేలు చేస్తుందని రైతులు తెలిపారు. కె.కోటపాడు, గొండుపాలెం, గుల్లేపల్లి, చౌడువాడ, మల్లంపాలెం, పాచిలవానిపాలెం తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

తాగునీటి కోసం ఆందోళన


ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు

గొలుగొండ: జోగుంపేట పంచాయతీ పేటమాలపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆ ప్రాంత ఎస్సీలు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సుమారు పది రోజుల నుంచి తాగునీరు సరఫరా జరగక తీవ్ర ఇబ్బందులకు గురతున్నట్టు వారు చెప్పారు. పంచాయతీ, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. జోగుంపేట ఎస్సీ వసతిగృహం వద్ద పైపులు పూర్తిగా ధ్వంసం కావడంతో నీరు సరఫరా కావడం లేదని వారు చెప్పారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని వారు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నేడు చోడవరంలో మెగా జాబ్‌మేళా

చోడవరం: స్థానిక డిగ్రీకాలేజీ ఆవరణంలో ఈనెల 19వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహిస్తున్నామని, ఉదయం 9గంటలకు మేళా ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

నాతవరం: జ్వరాలు ప్రబలిన గ్రామాల్లో పారిశుధ్య పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ తెలిపారు. ఆయన మండలంలో ఎం.బెన్నవరం, డి.ఎర్రవరం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించారు. దోమల నివారణ కార్యక్రమాన్ని వైద్య, పంచాయతీ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో చెత్త సంపద తయారీ కేంద్రాల జిల్లా కోఆర్డినేటరు నాగలక్ష్మి, ఎంపీడీవో ఉషాశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.